
సాక్షి
శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు

ఆదివారం । 28 । ఏప్రిల్ । 2024



సోమశిలలో 8.26 టీఎంసీలు
సోమశిల: సోమశిల జలాశయంలో శని వారం సాయంత్రానికి 8.262 టీఎంసీల నీరు నిల్వ ఉంది. వివిధ కాలువలకు 205 క్యూసెక్కులను విడుదల చేస్తున్నారు.



బంగారం ధరలు

24 క్యారెట్లు (10 గ్రాములు)	రూ.74,760
22 క్యారెట్ల ఆర్నమెంట్ (గ్రా)	రూ.6,678
మూడు శాతం జీఎస్టీతో	రూ.6,878
నవర (8 గ్రాములు)	రూ.55,024



పొదలకూరులో చోరీ
పొదలకూరులోని మారుతినగర్‌లో చోరీ జరిగింది. ఘటనలో 16 సవర్ల బంగారు నగలు, రూ.లక్షను దుండగులు చోరీ చేశారు. 8లో

న్యూస్‌రీల్

ఏపీ సెట్ నేడు
వెంకటాచలం: ఏపీ సెట్‌ను ఆంధ్రా యూనివర్సిటీ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించనున్నారని రీజినల్ కోఆర్డినేటర్, ప్రొఫెసర్ వీరారెడ్డి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. కాకుటూరులోని వీఎస్‌యూ కళాశాల, రామలింగాపురంలోని జగన్స్ డిగ్రీ కళాశాల, పాత జెడ్పీ కార్యాలయ సమీపంలోని కృష్ణచైతన్య డిగ్రీ కళాశాల, వీఆర్సీ సెంటర్‌లోని రావూస్, డీకేడబ్ల్యూ, వైఎంసీఏ గ్రౌండ్స్‌లోని వీఆర్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ పీజీ స్టడీస్‌లో పరీక్షను నిర్వహించనున్నామని చెప్పారు. ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 12.30 వరకు నిర్వహించనున్న పరీక్షకు 1767 మంది దరఖాస్తు చేసుకున్నారని వివరించారు.

విద్యుత్ బిల్లులను నేడూ చెల్లించొచ్చు
నెల్లూరు(వీఆర్సీసెంటర్): విద్యుత్ బిల్లులను ఆదివారం యథావిధిగా చెల్లించొచ్చని ఎస్పీడీసీఎల్ జిల్లా సర్కిల్ ఎస్‌ఈ విజయన్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. విద్యుత్ బిల్లుల వసూలు కేంద్రాలు యథాతథంగా పనిచేయనున్నాయని, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

కోడ్‌ను సమర్థంగా అమలు చేయాలి
- కలెక్టర్ హరినారాయణన్



మాట్లాడుతున్న హరినారాయణన్

నెల్లూరు(బారకాసు): ఎన్నికల కోడ్ సమర్థంగా అమలయ్యేలా ప్రతి అంశాన్ని సునిశితంగా పరిశీలించాలని కలెక్టర్ హరినారాయణన్ ఆదేశించారు. నగరపాలక సంస్థ ప్రాంగణంలోని కమాండ్ కంట్రోల్ సెంటర్ భవనంలో ఎన్నికల నోడల్ అధికారులతో శనివారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రచారానికి స్టార్ క్యాంపెయినర్లు వస్తున్న తరుణంలో కోడ్‌ను ఉల్లంఘించకుండా చూడాలని సూచించారు. మద్యం డంప్‌లు ఎక్కడున్నాయో గుర్తించి సీజ్ చేయాలని చెప్పారు. ఆటోలు, ద్విచక్రవాహనాలను తప్పక తనిఖీ చేయాలని ఆదేశించారు. జిల్లాలో విధులకు కేటాయించిన వారు పోస్టల్ బ్యాలెట్ కోసం ఫారం – 12ను మే ఒకటిలోపు అందజేయాలని సూచించారు. పోలింగ్ కేంద్రాల్లో వెబ్ కాస్టింగ్ కోసం శిక్షణ పొందిన వారిని వినియోగించుకోవాలని కోరారు. డీఆర్వో లవన్న, నోడల్ అధికారులు బాపిరెడ్డి, వెంకట్రావు, పద్మావతి, అనితారాణి, రాజు, రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

ప్రశాంతంగా పాలిసెట్
నెల్లూరు(అర్బన్): పాలిటెక్నిక్ కళాశాలల్లో ప్రవేశానికి నిర్వహించిన పాలిసెట్ జిల్లాలో ప్రశాంతంగా జరిగింది. నగరంలోని నాలుగు కేంద్రాల్లో నిర్వహించిన పరీక్షకు 2562 మందికి గానూ 2229 మంది హాజరయ్యారు. ఆత్మకూరులో 473 మందికి గానూ 391 మంది, కావలిలో 881 మందికి గానూ 705 మంది హాజరయ్యారు.

స్పెషల్ అబ్జర్వర్ రాక రేపు
నెల్లూరు(దర్గామిట్ట): ఎన్నికలకు సంబంధించిన స్పెషల్ జనరల్ అబ్జర్వర్‌గా నియమితులైన రిటైర్డ్ ఐఏఎస్ రామ్మోహన్ మిశ్రా నెల్లూరుకు సోమవారం రానున్నారు. జిల్లా యంత్రాంగం, కేంద్ర ఎన్నికల పరిశీలకులతో సమావేశమైన అనంతరం తిరుపతికి సాయంత్రం ఏడు గంటలకు పయనమవనున్నారు.

రూ.లక్ష సీజ్
చేజర్ల: ఎలాంటి పత్రాల్లేకుండా తరలిస్తున్న రూ.లక్షను చేజర్ల పోలీసులు శనివారం స్వాధీనం చేసుకున్నారు. వివరాలు.. నెల్లూరు నుంచి చిత్తూరు వైపు వెళ్తున్న టాటా వాహనాన్ని ఆదురుపల్లిలోని చేజర్ల క్రాస్‌రోడ్డులో ఏర్పాటు చేసిన చెక్‌పోస్ట్ వద్ద తనిఖీ చేశారు. ఈ క్రమంలో ఈ మొత్తాన్ని సీజ్ చేశారు. తగు పత్రాలను వెంట ఉంచుకోవాలని ఎస్సై ప్రభాకర్ సూచించారు.

స్ట్రాంగ్‌రూమ్‌లు సిద్ధం
నెల్లూరు(దర్గామిట్ట): ఓట్ల లెక్కింపునకు అవసరమైన కౌంటింగ్ కేంద్రాలు, స్ట్రాంగ్‌రూమ్‌లను సిద్ధం చేశామని కలెక్టర్ హరినారాయణన్ పేర్కొన్నారు. కనుపర్తిపాడులోని ప్రియదర్శిని ఇంజినీరింగ్ కళాశాలలో ఎన్నికల స్ట్రాంగ్ రూమ్, కౌంటింగ్ కేంద్రాలను సాధారణ పరిశీలకులతో కలిసి కలెక్టర్ శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ప్రియదర్శిని ఇంజినీరింగ్ కళాశాలలోని నార్త్ బ్లాక్‌లో నెల్లూరు సిటీ, రూరల్, కోవూరు, కావలి, ఉదయగిరి, కందుకూరు, ఆత్మకూరు నియోజకవర్గాలకు సంబంధించిన స్ట్రాంగ్‌రూమ్‌లను ఏర్పాటు చేశామన్నారు. ఎన్నికల సాధారణ పరిశీలకులు రామ్‌కుమార్ గౌతమ్, నితిన్‌సింగ్ బదూరియా, ట్రైనీ కలెక్టర్ సంజనా సిన్హా, కమిషనర్ వికాస్ మర్మత్, ఎస్పీ ఆరిఫ్ హఫీజ్, ఏఎస్పీ సౌజన్య, తహసీల్దార్ సుబ్బారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నవశకానికి శ్రీకారం

వైఎస్సార్‌సీపీ మేనిఫెస్టో విడుదల

- నవరత్నాలు 2.0 పేరిట మరింత సంక్షేమం
- పేదల జీవన ప్రమాణాల పెంపు
- జగనన్నకు జన నీరాజనాలు
- బూటకపు హామీల బాబూ.. మాకొద్దు



ప్రజాసంకల్ప యాత్రలో భాగంగా పల్లెలు, పట్టణాలు, నగరాల్లో పర్యటించిన సమయంలో ప్రజల కష్టాలను నేరుగా గమనించిన సీఎం జగన్‌మోహన్‌రెడ్డి వాటిని పరిష్కరించాలనే లక్ష్యంతో అడుగులేశారు. ఈ తరుణంలో 2019లో నవరత్నాల పేరిట మేనిఫెస్టోకు రూపకల్పన చేసి ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టాక వాటిని సమర్థంగా అమలు చేశారు. ఇచ్చిన హామీల్లో 99 శాతం మేర నెరవేర్చి ప్రజల హృదయాల్లో సుస్థిర స్థానాన్ని సంపాదించారు. రానున్న ఐదేళ్లలో ప్రజలకు తానేమి చేయనున్నాననే అంశాలను తెలియజేస్తూ నవరత్నాలు 2.0 పేరిట మేనిఫెస్టోను తాడేపల్లిలో శనివారం ఆయన విడుదల చేశారు. ఈ మేనిఫెస్టోతో తమకు రోజూ ఫెస్టివలేనని ప్రజలు ఆనందోత్సాహాలను వ్యక్తం చేస్తున్నారు. అధికారం కోసం ఆచరణ సాధ్యం కాని హామీలను గుప్పించి మోసగించే చంద్రబాబు తమకొద్దని.. సంక్షేమ, అభివృద్ధి ప్రదాత జగన్‌మోహన్‌రెడ్డికే తమ ఓటు అని ప్రజలు ముక్తకంఠంతో చెప్తున్నారు.

ప్రజా మేనిఫెస్టో


సీఎం జగన్‌మోహన్‌రెడ్డి విడుదల చేసిన మేనిఫెస్టో పేదల జీవన ప్రమాణాలను పెంచేలా ఉంది. దీని ద్వారా సంక్షేమం, అభివృద్ధితో రాష్ట్రం పరుగులు తీయనుంది. హామీలను సమర్థంగా అమలు చేసి ప్రజల మనస్సులను సీఎం గెలుచుకున్నారు. బూటకపు హామీలతో ప్రజలను చంద్రబాబు తప్పుదోవ పట్టిస్తున్నారు. – అరవిందరెడ్డి, దేవరపాళెం, నెల్లూరు రూరల్

‘రైతు భరోసా’ పెంపు హర్షణీయం


గత ప్రభుత్వ హయాంలో రైతుల సంక్షేమాన్ని విస్మరించారు. రైతు భరోసా పథకం ద్వారా ఐదేళ్లుగా రూ.13500 చొప్పున ప్రస్తుత ప్రభుత్వం అందిస్తోంది. దీంతో వ్యవసాయ ఖర్చులకు ఇబ్బంది తగ్గింది. రైతు భరోసా మొత్తాన్ని తాజాగా రూ.16 వేలకు పెంచడం సంతోషంగా ఉంది. – కృష్ణారెడ్డి, పాతదేవరాయపల్లి, అనంతసాగరం

ఆచరణ సాధ్యమైనవే చెప్పారు


ఆచరణ సాధ్యమైన హామీలనే వైఎస్సార్‌సీపీ మేనిఫెస్టోలో సీఎం జగన్‌మోహన్‌రెడ్డి పొందుపర్చారు. ఎన్నికల సమయంలో అబద్ధపు హామీలిచ్చి వాటిని అమలు చేయకుండా చంద్రబాబు మోసగాడిగా మిగిలిపోయారు. హామీలను సమర్థంగా అమలు చేసి ప్రజల హృదయాల్లో సీఎం సుస్థిర స్థానం పొందారు. – బాలకృష్ణారెడ్డి, పొదలకూరు

పథకాలను కొనసాగించడం సంతోషకరం


ప్రస్తుతం అమలవుతున్న సంక్షేమ పథకాలను కొనసాగించడం చాలా బాగుంది. అమ్మఒడి, పింఛన్లు తదితర పథకాలను గతం కంటే మిన్నగా పెంచి అందజేస్తామని చెప్పడం సంతోషకరం. జగనన్న మాటిచ్చారంటే కచ్చితంగా అమలు చేస్తారనే నమ్మకం ఉంది. – మొలకల విజయ, సీఎం నగర్, మనుబోలు

చాలా బాగుంది


ఎన్నికల సందర్భంగా జగనన్న విడుదల చేసిన మేనిఫెస్టో చాలా బాగుంది. 2014 ఎన్నికల సమయంలో హామీలిచ్చి అందులో 50 శాతాన్ని కూడా అమలు చేయకుండా చంద్రబాబు మోసం చేశారు. మరోసారి ఇలానే ప్రజలను వంచించేందుకు ఆయన యత్నిస్తున్నారు. ప్రస్తుత మేనిఫెస్టోను సీఎం మెరుగ్గా తీర్చిదిద్దారు. – ఇరుపని అంజయ్య, చుండి, వలేటివారిపాళెం

మాటకు కట్టుబడటమే సీఎం నైజం


మాటకు కట్టుబడటమే సీఎం జగన్‌మోహన్‌రెడ్డి నైజం. గత ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీల్లో 99 శాతం మేర అమలు చేశారు. ఏవైతే అమలు చేయగలరో వాటినే మేనిఫెస్టోలో తాజాగా పొందుపర్చారు. అధికారంలోకి వచ్చాక వీటిని సమర్థంగా అమలు చేస్తారనే నమ్మకం ప్రజల్లో ఉంది. – బ్రహ్మయ్య, నవాబుపేట, నెల్లూరు

జగనే మా నమ్మకం


సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ద్వారా గడిచిన ఐదేళ్లలో మా కుటుంబానికి రూ.రెండు లక్షల లబ్ధి చేకూరింది. అమ్మఒడి.. పొదుపు రుణం.. వైఎస్సార్ ఆసరా పథకాలు ఎంతో అండగా నిలిచాయి. కొత్తగా ఆటో తీసుకున్నా. వాహనమిత్ర ద్వారా మరింత సుఖంగా ఉంటామనే ఆశ కలిగింది. జగనే మా నమ్మకం. – అమ్మనబోయిన రవికుమార్, నందిపాడు ఎస్సీ కాలనీ, దుత్తలూరు

సున్నా వడ్డీ రుణాలు మంచిది


సున్నా వడ్డీ ద్వారా రుణాలను అందజేయనుండటం ఎంతో మేలు చేస్తుంది. బయటి వ్యక్తుల వద్ద వడ్డీలకు అప్పులు తీసుకురావడం.. తిరిగి చెల్లించడం భారంగా పరిణమిస్తోంది. రూ.మూడు లక్షల వరకు సున్నా వడ్డీ ద్వారా రుణాలను ఇస్తామని ప్రకటించడం చాలా ఆనందాన్ని కలిగిస్తోంది. – పెండెం అరుణమ్మ, చేజర్ల

మేలు చేసేలా మేనిఫెస్టో


విజయమే పరమావధిగా బూటకపు హామీలివ్వడం చంద్రబాబు నైజం. ఇలా అబద్ధాలు చెప్పడం సీఎం జగనన్నకు చేతకాదు. ప్రజలకు ఏమి అవసరమో గుర్తించి వాటిని మేనిఫెస్టోలో పొందుపర్చారు. ఈ పథకాలతో ప్రజలకు ఎంతో మేలు జరుగుతుందనే భరోసా ఏర్పడింది. – షాజహాన్, న్యూ కాలనీ, జాకీర్‌హుస్సేన్‌నగర్, నెల్లూరు

గొప్ప సదుద్దేశం


సంక్షేమం, రాష్ట్రాభివృద్ధిని దృష్టిలో ఉంచుకొని గొప్ప సదుద్దేశంతో మేనిఫెస్టోకు రూపకల్పన చేశారు. ఇందులో పొందుపర్చిన అంశాలు ప్రజలకు ఎంతో ఉపయోగకరంగా మారనున్నాయి. అన్ని వర్గాలకు ఎంతో మేలు జరగనుంది. ఈ మేనిఫెస్టోతో టీడీపీకి దిమ్మతిరగడం ఖాయం. – సుబ్బారెడ్డి, సత్యనారాయణపురం, నెల్లూరు

అధికారం కోసం అబద్ధాలు చెప్పలేదు


సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ప్రకటించిన మేనిఫెస్టో అద్భుతంగా ఉంది. చంద్రబాబు తరహాలో అధికారం కోసం అబద్ధాలు చెప్పడం, అడ్డమైన హామీలివ్వడం సీఎంకు చేతకాదు. రాష్ట్ర వనరుల మేరకు పేదలకు ఎంత వరకు చేయగలరో అంత మేరే సంక్షేమ పథకాలను ప్రకటించారు. – భూదేవమ్మ, దగదర్తి

‘అమ్మఒడి’ పెంపు ఆనందదాయకం


అమ్మఒడి ద్వారా ఇచ్చే మొత్తాన్ని రూ.15 వేల నుంచి రూ.17 వేలకు పెంచుతూ సీఎం నిర్ణయం తీసుకోవడం ఆనందదాయకం. హామీ ఇస్తే కచ్చితంగా అమలు చేస్తారనే నమ్మకం ఉంది. పేదలకు విద్యను అందించడంలో జగనన్న ఎప్పుడూ ముందుంటారు. చంద్రబాబు బూటకపు హామీలను నమ్మే పరిస్థితి లేదు. – నిడమానూరు లక్ష్మమ్మ, రాజుపాళెం, ఉలవపాడు

గతం కంటే మిన్నగా మేనిఫెస్టో



స్థానికులను ఆప్యాయంగా పలకరిస్తున్న విజయసాయిరెడ్డి

- వైఎస్సార్‌సీపీ నెల్లూరు లోక్‌సభ అభ్యర్థి విజయసాయిరెడ్డి

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట): గతంతో పోలిస్తే మరింత మెరుగైన సంక్షేమ పథకాలను అందించడమే లక్ష్యంగా వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ మేనిఫెస్టోకు రూపకల్పన చేసి సీఎం జగన్‌మోహన్‌రెడ్డి విడుదల చేశారని పార్టీ నెల్లూరు లోక్‌సభ అభ్యర్థి వేణుంబాక విజయసాయిరెడ్డి పేర్కొన్నారు. నగరంలోని ఎనిమిదో డివిజన్లో శనివారం నిర్వహించిన ఎన్నికల ప్రచారంలో ఆయన మాట్లాడారు. మాటకు కట్టుబడి ప్రజల సంక్షేమమే లక్ష్యంగా పథకాలను అమలు చేయడం సీఎంకే సాధ్యమని కొనియాడారు. గత ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీల్లో 99 శాతం మేర అమలు చేసి ప్రజల ఆదరాభిమానాలను చూరగొన్నారని చెప్పారు. పింఛన్ మొత్తాన్ని రూ.3500కు పెంచడంతో పాటు చేయూత, ఓబీసీ నేస్తం సాయాన్ని అధికం చేశారని తెలిపారు. మేనిఫెస్టోపై అన్ని వర్గాల ప్రజలు సంతృప్తితో ఉన్నారన్నారు.

ప్రజారంజక మేనిఫెస్టో
- ఎమ్మెల్సీ చంద్రశేఖర్‌రెడ్డి



మాట్లాడుతున్న చంద్రశేఖర్‌రెడ్డి

నెల్లూరు(దర్గామిట్ట): విలువలతో కూడిన జనరంజకమైన మేనిఫెస్టోను సీఎం జగన్‌మోహన్‌రెడ్డి విడుదల చేశారని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్సీ పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి కొనియాడారు. మాగుంట లేఅవుట్లోని పార్టీ జిల్లా కార్యాలయంలో విలేకరుల సమావేశంలో శనివారం ఆయన మాట్లాడారు. జిల్లాలో ప్రజాసేవ చేసేవారిని వైఎస్సార్సీపీ అభ్యర్థులుగా జగన్‌మోహన్‌రెడ్డి నిలిపారని, అయితే డబ్బు సంచులున్న వారికే టీడీపీ తరఫున టికెట్లు కేటాయించారని విమర్శించారు. నాలుగున్నరేళ్ల పాటు టీడీపీ సిటీ అభ్యర్థి నారాయణ పత్తాలేరని చెప్పారు. పార్టీ నెల్లూరు లోక్‌సభ, సిటీ అభ్యర్థులు విజయసాయిరెడ్డి, ఖలీల్ అహ్మద్‌కు విశేష ప్రజాదరణ లభిస్తోందని తెలిపారు. నారాయణకు నగర ప్రజలు తగిన బుద్ధి చెప్పడం తథ్యమన్నారు. చేసేదే చెప్పడం సీఎం నైజమని పేర్కొన్నారు. సంక్షేమ పథకాలను పేదలకు అందించి.. అవినీతికి తావులేకుండా ఉద్యోగాలను ఆయన కల్పించారని కొనియాడారు. జిల్లాలోని అన్ని స్థానాల్లో తమ పార్టీ గెలుపొందడం ఖాయమని తెలిపారు.

సీఎం పర్యటన ఏర్పాట్ల పరిశీలన



కందుకూరు: స్థానిక ఏరియా హాస్పిటల్ సర్కిల్ వద్ద బహిరంగ సభను సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ఆదివారం నిర్వహించనున్న నేపథ్యంలో ఆ ప్రాంతాన్ని ఎస్పీ ఆరిఫ్ హఫీజ్, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కందుకూరు అభ్యర్థి బుర్రా మధుసూదన్‌యాదవ్ శనివారం పరిశీలించారు. ఎలాంటి జాగ్రత్తలు చేపట్టాలి.. సభకు హాజరయ్యే ప్రజలకు ఇబ్బందులు తలెత్తకుండా అనుసరించాల్సిన చర్యలపై చర్చించారు. అనంతరం కనిగిరి రోడ్డులోని వ్యవసాయ మార్కెట్ యార్డులో ఏర్పాటు చేసిన హెలిప్యాడ్ ప్రదేశాన్ని పరిశీలించారు. సాయంత్రం మూడు గంటలకు హెలిప్యాడ్‌కు చేరుకొని అక్కడి నుంచి రోడ్డు మార్గంలో బహిరంగ సభ జరిగే ప్రదేశానికి సీఎం చేరుకోనున్న నేపథ్యంలో ఆ మార్గాన్ని పర్యవేక్షించారు. చేపట్టాల్సిన భద్రత చర్యలపై ఎస్పీ సమీక్షించారు. అనంతరం స్థానిక సబ్ కలెక్టర్ కార్యాలయంలో అధికారులతో సమావేశాన్ని ఎస్పీ నిర్వహించారు. సబ్ కలెక్టర్ విద్యాధరి తదితరులు పాల్గొన్నారు.

నేత్రపర్వంగా పుష్పయాగం



నెల్లూరు(బృందావనం): రామ్‌నగర్‌లోని శబరి శ్రీరామక్షేత్రంలో నిర్వహిస్తున్న కోదండరామ, ప్రసన్నాంజనేయస్వామి బ్రహ్మోత్సవాలు శనివారంతో ముగిశాయి. ఈ సందర్భంగా పుష్పయాగాన్ని నేత్రపర్వంగా నిర్వహించారు.
- మూలాపేటలోని రుక్మిణీ, సత్యభామ సమేత వేణుగోపాలస్వామి దేవస్థానంలో ముసుగులసేవ, పొన్నవాహనసేవను నిర్వహించారు. ఉభయకర్తలుగా వాసుదేవ్, వెంకటస్వామి, నరసింహారావు, శ్రీనివాసులు, రామారావు దంపతులు వ్యవహరించారు. దేవస్థాన పాలకమండలి చైర్మన్ మజ్జిగ చంద్రమౌళీరెడ్డి, ఈఓ గిరికృష్ణ పాల్గొన్నారు.

సీఎం జగన్ పాలన దేశానికే ఆదర్శం



మాట్లాడుతున్న కాకాణి గోవర్ధన్‌రెడ్డి

- ఆచరణ సాధ్యమయ్యే హామీలకే మేనిఫెస్టోలో చోటు
- మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి

వెంకటాచలం: సీఎం జగన్‌మోహన్‌రెడ్డి పరిపాలన దేశానికే ఆదర్శంగా నిలిచిందని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి పేర్కొన్నారు. మండలంలోని అనికేపల్లి, గొలగమూడి, కంటేపల్లి గ్రామాల్లో శనివారం నిర్వహించిన ఎన్నికల ప్రచారంలో ఆయన మాట్లాడారు. చంద్రబాబు లాంటి మోసపూరిత వ్యక్తి దేశ రాజకీయాల్లో ఎవరూ లేరని చెప్పారు. రైతులకు రుణమాఫీ చేస్తాననే హామీతో 2014లో అధికారంలోకి వచ్చిన ఆయన దాన్ని పట్టించుకోలేదని ఆరోపించారు. హామీల్లో దేన్నీ పూర్తిస్థాయిలో అమలు చేయలేదని ధ్వజమెత్తారు. గత ప్రభుత్వ హయాంలో జన్మభూమి కమిటీల పెత్తనంతో సంక్షేమ పథకాలు సక్రమంగా అందేవికావన్నారు.

ప్రజల జీవితాల్లో వెలుగులు

గడిచిన ఐదేళ్లలో విప్లవాత్మక మార్పులతో ప్రజల జీవితాల్లో వెలుగులను సీఎం నింపారని కొనియాడారు. పార్టీలతో ప్రమేయం లేకుండా అర్హులను సచివాలయాల ద్వారా ఎంపిక చేస్తున్నారని తెలిపారు. గత పాలనకు.. ఇప్పటి పాలనకూ మధ్య వ్యత్యాసాన్ని గమనించాలని కోరారు. రానున్న ఎన్నికల్లో జగనన్నకు మద్దతుగా నిలిచి నియోజకవర్గ అభివృద్ధికి సహకరించాలని కోరారు. ఆచరణ సాధ్యమయ్యే హామీలనే మేనిఫెస్టోలో సీఎం పొందుపర్చారని చెప్పారు. వ్యవసాయ సలహా మండలి మండల చైర్మన్ కోడూరు ప్రదీప్‌కుమార్‌రెడ్డి, పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు మందల వెంకటశేషయ్య, మండల కన్వీనర్ కొణిదెన మోహన్‌నాయుడు, నేతలు నంబూరు రాజానాయుడు, కొణిదెన విజయభాస్కర్‌నాయుడు, వెలిబోయిన వెంకటేశ్వర్లు, తుపాకుల కిరణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

బాబొచ్చారు... ప్లీజ్ రండి

- జనాలను బతిమిలాడిన తమ్ముళ్లు
- జనం లేక ప్రజాగళం వెలవెల
- ఫ్లాపైన చంద్రబాబు బహిరంగసభ



చంద్రబాబు సభకు పలుచగా హాజరైన జనం

కోవూరు: టీడీపీ అధినేత చంద్రబాబు వచ్చారు.. సభకు రండి ప్లీజ్ అంటూ ఆ పార్టీ శ్రేణులు జనాలను ప్రాధేయపడ్డారు. అయినా ప్రయోజనం లేకపోవడంతో ప్రజాగళం పేరిట బుచ్చిరెడ్డిపాళెంలో శనివారం ఆయన నిర్వహించిన బహిరంగ సభ అట్టర్‌ఫ్లాపైంది.

బేజారి.. తిరుగుముఖం పట్టి

జనాల్లేక ప్రజాగళం సభ వెలవెలబోయింది. వాస్తవానికి సాయంత్రం ఆరింటికే చంద్రబాబు వస్తారని ప్రకటించినా, గంటన్నర ఆలస్యంగా ఆయన హాజరయ్యారు. సభా ప్రాంగణమైన చెన్నూరు రోడ్డుకు వద్దకు వచ్చిన అరకొర జనం సైతం బేజారెత్తారు. చంద్రబాబు ప్రసంగ సమయంలోనే ప్రజలు జారుకున్నారు. నేను చెప్పేది వినండి తమ్ముళ్లు అని ప్రాధేయపడటం గమనార్హం. మహిళలు, వృద్ధులను తరలించినా వారు బాగోగులను పట్టించుకోకపోవడంతో మండిపడ్డారు. స్థానిక నేతలపై దుమ్మెత్తిపోశారు.

దిక్కుతోచక.. అయోమయం

బాబు ప్రసంగం వినండి.. వెళ్లొద్దంటూ టీడీపీ నేత యర్రంరెడ్డి గోవర్ధన్‌రెడ్డి రోడ్డుపై నిలబడి జనాలను ప్రాధేయపడ్డారు. అయినా వారు పెడచెవిన పెట్టడంతో దిక్కుతోచక అయోమయ స్థితిలో ఆయన ఉండిపోయారు. చంద్రబాబు సభ జోష్ నింపుతుందని స్థానిక నేతలు భావించగా, దానికి విరుద్ధంగా పరిస్థితి మారింది.

నేతల రుసరుస

బాబు రోడ్‌షో సమయంలో టీడీపీ కోవూరు అభ్యర్థి ప్రశాంతిరెడ్డి మినహా మరెవర్నీ వాహనంపైకి అనుమతించలేదు. దీంతో తమ అభిమాన నేతలకు అన్యాయం జరిగిందని నేతలు రుసరుసలాడారు.

జగన్ పాలనలోనే బీసీలకు న్యాయం



మాట్లాడుతున్న కృష్ణయ్య, చిత్రంలో రాజమోహన్‌రెడ్డి, విక్రమ్‌రెడ్డి

• బీసీ సంక్షేమ సంఘం జాతీయాధ్యక్షుడు కృష్ణయ్య

ఆత్మకూరు: 'బీసీలకు పెద్దపీట వేసింది సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మాత్రమే. ఆయన హయాంలోనే వారికి న్యాయం జరిగింది' అని బీసీ సంక్షేమ సంఘం జాతీయాధ్యక్షుడు, రాజ్యసభ సభ్యుడు ఆర్.కృష్ణయ్య అన్నారు. ఆత్మకూరు ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి ఆధ్వర్యంలో నియోజకవర్గ స్థాయి బీసీల ఆత్మీయ సమావేశం శనివారం ఆత్మకూరులోని శ్రీధర్ గార్డెన్స్‌లో జరిగింది. దీనికి కృష్ణయ్య విచ్చేసి మాట్లాడారు. సీఎం జగన్ విజన్‌తోనే రాష్ట్రంలోని ప్రభుత్వ పాఠశాలల రూపురేఖలు మారిపోయాయన్నారు. పేద పిల్లల కోసం ఇంగ్లిష్ మీడియం ప్రవేశపెట్టారన్నారు. అప్పులు చేసి కార్పొరేట్ పాఠశాలల్లో పిల్లల్ని చదివించే బాధ తల్లిదండ్రులకు తప్పిందన్నారు. గత ప్రభుత్వాల కాలంలో లీడర్లు బాగుపడ్డారని, జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో సంక్షేమ పథకాల ద్వారా ప్రజలు ఆర్థికంగా అభివృద్ధి చెందారన్నారు. సొంత మామను వెన్నుపోటు పొడిచి చంద్రబాబు అధికారంలోకి వచ్చారని, జగన్ ప్రజల ఆదరాభిమానాలతో ముఖ్యమంత్రి అయ్యారన్నారు. బీసీలకు వైఎస్సార్‌సీపీ పెద్దపీట వేసిందని, ఎంతో మందికి ఎమ్మెల్యే, ఎంపీ టికెట్లు ఇచ్చిందన్నారు. కార్యక్రమంలో రాజ్యసభ సభ్యుడు బీద మస్తాన్‌రావు, మాజీ ఎంపీ మేకపాటి రాజమోహన్‌రెడ్డి, బీసీ నాయకులు దేవరాల సుబ్రహ్మణ్యం, మురళీకృష్ణ యాదవ్, జేసీఎస్ కన్వీనర్ డాక్టర్ సీహెచ్ ఆదిశేషయ్య, జెడ్పీటీసీ పేర్ల పార్థసారథి తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో పేదలకు మేలు

• కందుకూరు అభ్యర్థి మధుసూదన్ యాదవ్

కందుకూరు: వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఎన్నో సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టి పేదలకు మేలు చేసిందని వైఎస్సార్‌సీపీ కందుకూరు అభ్యర్థి బుర్రా మధుసూదన్ యాదవ్ అన్నారు. పట్టణంలోని పార్టీ కార్యాలయంలో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కందుకూరులో ఆదివారం సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి బహిరంగ సభ జరుగుతుందన్నారు. దీనికి ప్రజలు భారీగా తరలివచ్చి ఆయనకు కృతజ్ఞతలు చెప్పాలని కోరారు. 40 వేల నుంచి 50 వేల మంది స్వచ్ఛందంగా తరలివస్తారని అంచనా వేస్తున్నామన్నారు. నియోజకవర్గాన్ని ఎమ్మెల్యే మానుగుంట మహీధర్‌రెడ్డి బాగా అభివృద్ధి చేశారని, నేడు పార్టీ విజయం కోసం ఆయన పూర్తిగా సహకరిస్తున్నారని వెల్లడించారు. సమావేశంలో నాయకులు షేక్ రఫీ, గంగవరపు వెంకట్రావు, పచ్చిపాటి తిరుపతిరెడ్డి, పరిటాల వీరాస్వామి, జాజుల కోటేశ్వరరావు, ఇంటూరి మాధవరావు, హరిబాబు, కృష్ణారెడ్డి పాల్గొన్నారు.

కాకర్ల, బొల్లినేని వర్గాల మధ్య తోపులాట



ప్రచార రథం ఎక్కే విషయంలో తెలుగు తమ్ముళ్ల మధ్య తోపులాట

కొండాపురం: ఉదయగిరి నియోజకవర్గంలో తెలుగుదేశంలో విభేదాలు రోజురోజుకు అధికమవుతున్నాయి. టీడీపీ అభ్యర్థి కాకర్ల సురేష్ ఎన్నికల ప్రచారం నిర్వహించేందుకు శనివారం సాయంత్రం మండలంలోని పొట్టిపల్లి గ్రామానికి వెళ్లాడు. అప్పటికే అక్కడ మాజీ ఎమ్మెల్యే బొల్లినేని, కాకర్ల వర్గాలున్నాయి. వారు ప్రచార రథం ఎక్కేందుకు పోటీ పడ్డారు. ఈ క్రమంలో సురేష్ ఎదుటే వాదులాటకు దిగారు. అతను జనం చూస్తున్నారని, పార్టీ పరువు పోతోందని భావించి సర్ది చెప్పినా ఉపయోగం లేకుండాపోయింది. మరి కొంతసేపటికి ఇరువర్గాల మధ్య తోపులాట జరిగింది. దీంతో కాకర్ల ప్రచార రథం దిగి నాలుగు ఇళ్లకు వెళ్లి కరపత్రాలు అందజేసి వెళ్లిపోయాడు. నియోజకవర్గంలో పార్టీలో ఆధిపత్యం కోసం ఇరువర్గాలు పోటీ పడుతూనే ఉన్నాయి.

నిమ్మధరలు (కిలో)	నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్ ధరలు	
పెద్దవి : రూ.100	బ్రాయిలర్ (లైవ్) : 143	బ్రాయిలర్
సన్నవి : రూ.90	లేయర్ (లైవ్) : 93	స్కిన్‌లెస్ : 284
పండ్లు : రూ.80	బ్రాయిలర్ చికెన్ : 254	లేయర్ చికెన్ : 158

ఆస్పత్రుల్లో అందుబాటులో ఓఆర్ఎస్ ప్యాకెట్లు



పెద్దాస్పత్రిలో ఓఆర్ఎస్ కార్నర్‌ను పరిశీలిస్తున్న అధికారులు

నెల్లూరు(అర్బన్): ఉష్ణోగ్రతలు అధికంగా నమోదవుతున్న నేపథ్యంలో ప్రభుత్వ ఆదేశాల మేరకు ప్రజల కోసం ఆస్పత్రుల్లో ఓఆర్ఎస్ కార్నర్‌లు ఏర్పాటు చేశామని డీఎంహెచ్ పెంచలయ్య, జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ సిద్ధానాయక్ తెలిపారు. పెంచలయ్య, నిఘా అధికారి డాక్టర్ భాస్కర్ బృందం శనివారం నెల్లూరులోని సర్వజన ఆస్పత్రి (పెద్దాస్పత్రి)ని సందర్శించారు. ఈ సందర్భంగా డీఎంహెచ్‌ఓ మాట్లాడుతూ జిల్లాలోని అన్ని పీహెచ్‌సీలు, సీహెచ్‌సీలు, పెద్దాస్పత్రితోపాటు అంగన్‌వాడీ సెంటర్లు, సచివాలయాల్లో ఓఆర్ఎస్ కార్నర్‌లు ఏర్పాటు చేశామన్నారు. అలాగే మెడికవర్, అపోలో, నారాయణ, కిమ్స్ తదితర హాస్పిటళ్లలోనూ ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందుబాటులో ఉంచామన్నారు. ఉపాధి హామీ కార్మికులకు పంపిణీ చేశామన్నారు. ప్రజలు వినియోగించుకోవాలన్నారు. ప్రైవేట్ ఆస్పత్రుల్లో అగ్ని ప్రమాదాల నివారణకు తీసుకున్న చర్యలపై డీఎంహెచ్‌ఓ బృందం ఆడిట్ నిర్వహించింది. డిప్యూటీ సూపరింటెండెంట్‌లు నరేంద్ర, మస్తాన్ బాషా తదితరులు పాల్గొన్నారు.

పెళ్లికెళ్లొచ్చేలోగా..

• 16 సవర్ల బంగారు నగలు, రూ.లక్ష నగదు చోరీ

పొదలకూరు: బంధువుల పెళ్లికి వెళ్లొచ్చేలోగానే దొంగలు ఓ ఇంటిని కొల్లగొట్టారు. పోలీసుల కథనం మేరకు.. మనుబోలు మండలం వడ్లపూడి గ్రామానికి చెందిన తోకల సురేష్ 14 సంవత్సరాలుగా పొదలకూరు మారుతీనగర్లో నివాసం ఉంటూ జేసీబీ ఆపరేటర్‌గా పని చేస్తున్నాడు. ఈ క్రమంలో స్వగ్రామంలో బంధువుల పెళ్లి ఉండడంతో గురువారం ఇంటికి తాళం వేసుకుని కుటుంబ సమేతంగా వెళ్లాడు. శుక్రవారం రాత్రి తిరిగొచ్చి చూసి చోరీ జరిగిందని నిర్ధారించారు. దొంగలు బీరువాను పగులగొట్టి 16 సవర్ల బంగారు నగలు, రూ.లక్ష నగదును అపహరించారని శనివారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఎస్సై రామకృష్ణ ప్రాథమికంగా విచారణ నిర్వహించి క్లూస్ టీమ్‌ను రప్పించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వృద్ధుడి ఆత్మహత్య

సంగం: మండలంలోని పెరమనకు చెందిన ఓ వృద్ధుడు పురుగు మందు తాగి ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతిచెందాడు. ఎస్సై నాగార్జునరెడ్డి కథనం మేరకు.. చెంచురామయ్య (70)కు ఏ కష్టమొచ్చిందో కానీ శుక్రవారం పురుగు మందు తాగాడు. గమనించిన కుటుంబ సభ్యులు ఆయన్ను నెల్లూరు ప్రభుత్వ వైద్యశాలకు తరలించగా అక్కడ చికిత్స పొందుతూ శనివారం మృతిచెందాడు. పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని కుటుంబసభ్యులకు అప్పగించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై తెలిపారు.